భారతీయ నృత్య ప్రదర్శన

సుల్తాన్‌బజార్: ఫ్యూచర్ టీచర్ అకాడమీ ఆధ్వర్యంలో గణేశ్ టెంపుల్ వద్ద నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. భారతీయ సంస్కృతికి అద్దం పట్టే భారతీయ నృత్య ప్రదర్శనలను నిత్యం స్ఫూర్తినిస్తాయని అన్నారు. నాట్య గురువులు డా. రేవతిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నృత్యకారులు రియా, శరణ్య, అక్షర, అక్షిత, శ్రేష్ట, అనిక, సాన్వీ, తన్వీ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చాంద్రాయణగుట్ట: జై గణేష భక్తి సమితి చాంద్రాయణగుట్ట నియోజకవర్గ అధ్యక్షుడిగా కందికల్ గేట్‌కు చెందిన కాశమోని శ్యాంరావు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి చైర్మన్ కె.ఎస్.ఆనంద్ రావు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్యాంరావు బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ.... సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పట్టే మన పండుగలను ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా జరుపుకోవాలన్నారు. ముఖ్యంగా వినాయక నిమజ్జనం రోజున భక్తులంతా ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు కేఎస్ ఆనంద్‌రావుకు ధన్యవాదాలు తెలియజేశారు.

మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి అదృశ్యం


మహ్మద్ సల్మాన్ (ఫైల్)

డబీర్‌పురా: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చంచల్‌గూడ న్యూ రోడ్డు డైమండ్ హోటల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖుద్దూస్ కుమారుడు మహ్మద్ సల్మాన్ (28) కొన్ని రోజులుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. గత నెల 31వ తేదీన సాయంత్రం 4.30 గంటలకు సల్మాన్ ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బెల్టుషాప్‌పై పోలీసుల దాడులు

నిందితురాలిపై ఇప్పటికే 33 కేసులు

చాంద్రాయణగుట్ట: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.50 వేల విలువజేసే 70.2 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసారావు తెలిపిన వివరాల ప్రకారం.. లలితాబాగ్‌కు చెందిన ఎస్.శోభరాణి అలియాస్ లలితమ్మ(50), దీపక్‌కుమార్(26), నితీష్ కుమార్(21)లు వైన్‌షాప్‌లు మూసేసిన తర్వాత అక్రమంగా బెల్టుషాప్‌ను నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, ఛత్రినాక పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్‌లో ఎక్కువ రేట్‌కు విక్రయించి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. లలితపై ఇప్పటి వరకు 33 కేసులు ఉన్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ప్రజలు పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

గోల్కొండ: గణేష్ నిమర్జన ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ ఊరేగింపులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ కృష్ణగౌడ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం చైర్మన్ జాహెద్ అలీ బుధవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో అదనపు డీసీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఏసీపీ తదితరులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... నగరంలో ఇరువర్గాల పండుగలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందన్నారు. హైదరాబాద్ పండుగ శోభను సంతరించుకుందని ఇటువంటి సందర్భాలలో ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకుంటే నగర ప్రతిష్ట రెట్టింపు అవుతుందన్నారు. పోలీసులు ఊరేగింపుల నిర్వాహకులకు అన్ని వేళల అండగా ఉండి శాంతియుత వాతావరణంలో ఊరేగింపులు జరిగేందుకు పక్కా ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డిఐ రాజేంద్ర ప్రసాద్ తదితరులున్నారు.

ఎంజే మార్కెట్‌లో స్వాగత వేదిక పరిశీలన

అబిడ్స్: గణేశ్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన రూట్‌ను పలు శాఖల ఉన్నతాధికారులు బుధవారం పర్యవేక్షించారు. అదే విధంగా పాతబస్తీ నుంచి వచ్చిన అధికారుల బృందం ఎంజే మార్కెట్‌లో ఆగి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి స్వాగత వేదికను స్వయంగా పరిశీలించారు. ఎంజే మార్కెట్ నుంచి అబిడ్స్, బషీర్‌బాగ్ మీదుగా వెళ్లే విగ్రహాల రూట్లను ఉన్నతాధికారుల బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ సీవీఆనంద్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ జోయల్ డేవిస్‌తో పాటు వాటర్ బోర్డ్, జీహెచ్‌ఎంసీ, టీఎస్‌ఎస్‌పీడీసీఎల్, ఆర్. అండ్‌బి, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి రెడీ.!


ప్రారంభానికి సిద్ధమైన ఫలక్‌నుమా ఆర్‌ఓబీ రెండో లేన్

ప్రారంభానికి సిద్ధమైన ఫలక్‌నుమా ఆర్‌ఓబీ రెండో లేన్

- నిమజ్జనం అనంతరం ప్రారంభానికి సన్నాహాలు
- తీరనున్న వాహనదారుల కష్టాలు

చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) రెండో లేన్ ఎట్టకేలకు నిర్మాణ పనులు పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధమయ్యింది. వంతెనకు ఇప్పటికే రంగులు సైతం పూర్తి కాగా.... లైటింగ్ లాంటి చిన్న చిన్న పనులు తుది దశలో ఉన్నాయి. వినాయక నిమజ్జనం అనంతరం ఫ్లై ఓవర్‌ను వాహనదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఒకవైపు మాత్రమే వెళ్లాల్సిన వన్ వే వంతెనపై రెండో వంతెన పూర్తి కాని కారణంగా మూడేళ్ల పాటు రెండు వైపులా వెళ్లే వాహనాల రాకపోకలకు అనుమతించారు. ఐదారు నెలల్లో రెండో వంతెన అందుబాటులోకి వస్తే సాఫీగా రాకపోకలు సాగించవచ్చన్న వాహనదారుల ఆశ నెరవేర సమయం ఆసన్నమయ్యింది.

పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో.

ఫలక్‌నుమా రైల్వే వంతెన 2020 అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు కృంగిపోయి ప్రమాదకరంగా మారిన విషయం విదితమే. ఓ వైపు బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడం... మరో వైపు విస్తీర్ణం సైతం తక్కువగా ఉండడంతో రోజురోజుకు పెరుగుతున్న వాహనాలతో రద్దీగా మారుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ బ్రిడ్జిని ఆధునీకరించడంతో పాటు దీని పక్క నుంచే మరో నూతన బ్రిడ్జి కూడా నిర్మించేందుకు జీహెచ్‌ఎంసీ శ్రీకారం చుట్టింది.

సంతోషకరం..



గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే మొదలై ప్రస్తుతానికి పూర్తయ్యాయి. ఈ వంతెన అందుబాటులోకి వస్తే చాంద్రాయణగుట్ట - చార్మినార్ రూట్‌లో రాకపోకలు సాగించే వాహనదారులకు ఎంతో వెసులుబాటు కలుగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో ఫలక్‌నుమా వరకు మెట్రో రైలు సైతం వస్తుండడంతో ఈ ప్రాంత రూపురేకలు మరింతగా మారనున్నాయి.

– కె.గణేష్‌రాథోడ్, కాంగ్రెస్ నేత


పాదచారుల కోసం నిర్మించిన ట్రాక్

ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట రూట్‌లో పోయే వాహనాలు ఒక బ్రిడ్జిపై.. వచ్చే వాహనాలు మరో బ్రిడ్జిపై వెళ్లేలా దాదాపు రూ.52 కోట్లతో పనులను ప్రారంభించారు. 2021 మార్చిలో వాహనాల రాకపోకలను పూర్తిగా నిషేధించింది. చాంద్రాయణగుట్ట వైపు వెళ్లే వంతెన పనులను పూర్తి చేసి అదే ఏడాది నవంబర్ 2వ తేదీనా వాహనదారులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. గతేడాది ప్రారంభమైన రెండో లేన్ పనులు ప్రస్తుతానికి పూర్తయ్యాయి.

వంతెన కింద నాలా మార్గం....

స్టేషన్ వెళ్లే వారికి బాక్స్ మార్గం

ఈ బ్రిడ్జికి ఎగువన హషామాబాద్ నుంచి వచ్చే నల్లవాగు నాలా నీరు ఈ బ్రిడ్జి కింది నుంచి సాఫీగా వెళ్లేందుకు భారీ బాక్స్ డ్రెయిన్‌ను నిర్మించారు. పైన ఉన్న పల్లె చెరువు నుంచి ఎంత పెద్ద వరద వచ్చినా ఈ బ్రిడ్జికి అవరోధం కలగకుండా కాంక్రీట్‌తో నాలా మార్గాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు రైల్వే ప్రయాణికులు కూడా సాఫీగా ఫలక్‌నుమా రైల్వేస్టేషన్‌కు చేరుకునేలా భారీ కాంక్రీట్ బాక్స్‌ను ఏర్పాటు చేశారు. బ్రిడ్జిపై పాదచారులు వెళ్లేందుకు కూడా వాహనాలతో సంబంధం లేకుండా ప్రత్యేక లైన్‌ను నిర్మించారు. ఇక బాక్స్ నుంచి చాంద్రాయణగుట్ట వైపు బ్రిడ్జికి ఇరువైపులా సర్వీస్ రోడ్డును కూడా సిద్ధం చేశారు.


స్టేషన్‌కు వెళ్లేందుకు బ్రిడ్జి కింద ఏర్పాటు చేసిన బాక్స్

శ్రీకృష్ణ పాద శరణం



గన్‌ఫౌండ్రీ: శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో 'కృష్ణం పాద శరణం'పేరిట బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సంస్థ వ్యవస్థాపకురాలు, నాట్య గురువు ప్రొఫెసర్ పి.రమాదేవి చిన్నారులతో కలిసి చిన్ని కృష్ణుడిని యశోదమ్మ పరీక్షించిన తీరు.. యశోదమ్మకు కలిగిన గొప్ప అనుభూతి వంటి విషయాలపై సాగిన నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పద్మశ్రీ శోవన నారాయణకు మీనాక్షమ్మ అవార్డ్ ఫర్ ఎక్సలెన్సీ పురస్కారాన్ని అందజేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ..... పదేళ్లుగా తల్లి పేరిట ప్రతిఏటా పురస్కారాలను అందజేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్‌వీ సుబ్రమణ్యం, తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కోట్ల హన్మంతరావు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీతలు కళాకృష్ణ, డా. భాగవతుల సేతూరాం, నాట్య గురువు డా. ఎస్పీ భారతి తదితరులు పాల్గొన్నారు.

రేతిబౌలి చౌరస్తాలో మల్టీలెవల్ ఫ్లై ఓవర్

రేతిబౌలి చౌరస్తాను సందర్శించిన బల్దియా జోనల్ కమిషనర్


రేతిబౌలి చౌరస్తా వద్ద కొత్త ఫ్లై ఓవర్ డ్రాఫ్టును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

గోల్కొండ: ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రేతిబౌలి చౌరస్తా వద్ద తలపెట్టిన కొత్త ఫ్లై ఓవర్ పరిసరాలను బల్దియా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి బుధవారం పరిశీలించారు. వివిధ శాఖల అధికారులకు ఆయన మెహిదీపట్నం నుంచి రేతిబౌలి చౌరస్తా, నానల్‌నగర్ వరకు పర్యటించారు. రూ.398 కోట్లతో మల్టీలెవల్ ఫ్లైఓవర్ డ్రాఫ్ట నమూనాతో ఆయన రేతిబౌలి చౌరస్తా పరిసరాలు అక్కడ ట్రాఫిక్ తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలపై ట్రాఫిక్, పోలీసు అధికారులతో చర్చించారు. రేతిబౌలి నుంచి నానల్‌నగర్ జంక్షన్ వరకు రూ.398 కోట్లతో చేపట్టిన ఈ పనులు పూర్తయితే మెహిదీపట్నం నుంచి టోలిచౌకీ వరకు ట్రాఫిక్ తగ్గించే అవకాశం ఉందని ఆయన అధికారులతో అన్నారు. మొదటి లెవల్ మెహిదీపట్నం నుంచి టోలిచౌకీ వరకు.. రెండో లెవల్ లంగర్ హౌస్ నుంచి మెహిదీపట్నం వరకు ఈ పనులు ఉంటాయని ఆయన అన్నారు. ఆయన వెంట మెహిదీపట్నం బల్దియా డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, కుల్సుంపురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య తదితరులున్నారు.

ఫార్మసీ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలి



సుల్తాన్‌బజార్: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఫార్మసీ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని తెలంగాణ ఫార్మసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కోఠిలోని సంఘం కార్యాలయంలో 104 సర్వీస్‌లో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 104 అంబులెన్స్ సర్వీస్‌లో పనిచేస్తున్న ఆఫీసర్లకు కొనసాగింపు ఇచ్చి పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇప్పించాలని కోరారు. 17 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సేవలందిస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ విషయంపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్‌తో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

నిమజ్జన శోభా ఏ మాత్రం తగ్గకుండా ఏర్పాట్లు

- ఉత్సవాలు ప్రశాంతంగా ముగిసేలా వేలాది పోలీసులతో బందోబస్తు
- సుమారు 50వేల గణేశ్ విగ్రహాల నిమజ్జనం జరిగే అవకాశం
- నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్


భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సీవీ ఆనంద్. చిత్రంలో రాచకొండ, సైబరాబాద్ కమిషనర్లు సుధీర్‌బాబు, అవినాష్ మహంతి, కార్యదర్శి శశిధర్

అబిడ్స్: నగరంలో గణేశ్ సామూహిక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు 29 వేల మంది పోలీసు బలగాలతో బందోబస్తు చేపడుతున్నట్లు నగర పోలీస్ కమిషనర్, డీజీ సీవీ ఆనంద్ వెల్లడించారు. బుధవారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వివిధ ప్రభుత్వ శాఖల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 రోజులుగా పోలీస్‌స్టేషన్ నుంచి మొదలుకొని పోలీస్ కమిషనర్ కార్యాలయం వరకు పలు దఫాలుగా సమీక్షా సమావేశాలు నిర్వహించి లోటుపాట్లను అధిగమించామని పేర్కొన్నారు. జోన్ల వారీగా గుర్తించిన లోపాలను సరిదిద్దేందుకు జోన్ డీసీపీలు, ఇతర అధికారులు పోలీస్‌స్టేషన్ల వారీగా ర్యాపిడ్ యాక్షన్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజల్లో భద్రతా భావాలను పెంపొందించామని తెలిపారు.

రహదారులకు మరమ్మతులు చేయించాం..

చాలా ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని మండపాల నిర్వాహకులు కోరారన్నారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు అధికారులతో చేయించామని తెలిపారు. సామూహిక వినాయక నిమజ్జనోత్సవ శోభా ఏ మాత్రం తగ్గకుండా ఏర్పాట్లను బ్రహ్మాండంగా చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. సుమారు 50వేల గణేశ్ విగ్రహాల నిమజ్జనం జరిగే అవకాశం ఉందన్నారు. వినాయక నిమజ్జనానికి క్రేన్‌లను సిద్ధంగా ఉంచడంతో పాటు ఎప్పటికప్పుడు ట్రాఫిక్ నియంత్రకు అధికారులు సిబ్బందికి సూచనలు చేస్తున్నామని తెలిపారు.

134 క్రేన్లను ఏర్పాటు చేశాం...

జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ రఘుప్రసాద్ మాట్లాడుతూ... వినాయక నిమజ్జనానికి దాదాపు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. 269 మొబైల్ క్రేన్లు, విగ్రహాల నిమజ్జనం కోసం 134 క్రేన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. 13 కంట్రోల్ రూమ్‌లను జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. వినాయక విగ్రహాలకు అడ్డు రాకుండా రోడ్లపై ఏపుగా పెరిగిన చెట్లకొమ్మలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఆర్‌టీఏ జాయింట్ కమిషనర్ రమేష్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు బుచ్చిరెడ్డి, మెట్టు వైకుంఠం, ఆలే భాస్కర్, గోవింద్‌రాఠి, శ్రీరామ్ వ్యాస్, ఉమా మహేందర్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

నిమజ్జనానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సువర్ణ అక్షరాలతో రాసుకునే విధంగా ఈనెల 6వ తేదీన గణేశ్ నిమ్మజనానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విచ్చేసి ప్రసంగించనున్నట్లు ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ వెల్లడించారు. నిమజ్జనం రోజు నగరమంతా కాషాయమవుతుందని తెలిపారు. నిమజ్జనంలో లక్షలాది మంది పాల్గొంటారని ఆయన తెలిపారు.


రూ.1.51 లక్షలకు లడ్డూ సొంతం చేసుకున్న బొజ్జ వెంకటేష్



హనుమాన్ ధూల్‌పేట మండపంలో.. కార్పొరేటర్ శశికళ


కేఎస్.నగర్‌లో దర్పల్లి నర్సింలు పూజలు


గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న చిన్నారులు

మహా గణపతిం మనసా స్మరామి.!

ఏకదంతా.!



నీవే జగమంతా.!



దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా అంటూ ఏకదంతుడిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజిస్తున్నారు. చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ పరిధిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. వివిధ రూపాల్లో గణనాథుడు అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఎక్కడ చేసినా వక్రతుండుడే దర్శనమిస్తున్నాడు. దీంతో కాలనీలు, బస్తీలు ఆలయాల పరిసరాలను తలపిస్తున్నాయి. మొత్తం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. గణేశ్ మండపాలను భక్తులు విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ కమిటీలు ప్రత్యేక పర్యవేక్షణలో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆరు రోజులుగా పూజలందుకున్న వినాయకుడు ఏడో రోజు బుధవారం పలు ప్రాంతాల్లో గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ బృందం


షేక్‌పేట్‌లో వినాయకుడి పూజల్లో మాగంటి వజ్రనాథ్ తదితరులు


బీజేయూఎస్ అధ్యక్షుడు రాఘవరెడ్డిని కలిసిన కార్వాన్ సభ్యులు


వినాయకుడిని దర్శించుకుంటున్న బి.సాయిబాబాచారి



గుడిమల్కాపూర్‌లో వినాయక మండపంలో నాయకులు దేవర వంశీ తదితరులు


వినాయక మండపాన్ని సందర్శించిన సంతోష్ నగర్ ఏసీపీ సుఖ్‌దేవ్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ బి.నాగరాజు


గౌలిపురాలో..


నాగులబండ గణేశ్ మండపంలో హిందూ ధర్మ జాగరణ ఫౌండర్ చీకోటి ప్రవీణ్


మరిగెమ్మ దేవాలయ ప్రాంగణంలో..


హనుమాన్ స్ట్రీట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..


గుడిమల్కాపూర్ శివాలయంలో...


ఆర్యవైశ్య సత్రం గణపతి మండపంలో..


ఫీల్‌ఖానాలో..


సంజయ్‌బస్తీ గణపతి మండపంలో..





